## క్లుప్తంగా

### నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

**నల్లగొండ:** పట్టణంలో 11కేవీ విద్యుత్ లైన్ పనులు జరుగుతున్నందున బుధవారం వివిధ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ ఏడీఈ నవీద్ అహ్మద్ ఒక ప్రకటనలో తెలిపారు. దారుపాషాకాలని, భారత్ గ్యాస్ ఏరియా, శంస్‌నగర్, ప్రభుత్వ ఆస్పత్రి ఏరియాల్లో ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు గమనించి తమకు సహకరించాలని కోరారు.

### బస్సు సర్వీసును పునరుద్ధరించాలని వినతి

**చండూరు :** నెర్మట గ్రామానికి ఆర్టీసీ బస్సు సర్వీసును పునరుద్ధరించాలని కోరుతూ సీపీఎం చండూరు మండల సహాయ కార్యదర్శి జెర్రిపోతుల ధనంజయగౌడ్ మంగళవారం నల్లగొండ డిపో అసిస్టెంట్ మేనేజర్ హుస్సేన్‌కు విద్యార్థులతో కలిసి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో విద్యార్థులు కొంపెల్లి నాగేశ్వరి, జెర్రిపోతుల స్నేహ, వాణి, మంజుల పాల్గొన్నారు.

### నేడు సర్వసభ్య సమావేశం

**నార్కట్‌పల్లి :** స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ సూదిరెడ్డి నరేందర్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ ఉమేష్ తెలిపారు. సమావేశానికి ప్రజాప్రతినిధులు సమయానికి హాజరుకావాలన్నారు. అదేవిధంగా తమ శాఖల పూర్తిస్థాయి నివేదికతో అధికారులు సమావేశానికి రావాలన్నారు. చివరి సర్వసభ్య సమావేశం కావడంతో ఎంపీటీసీలకు వీడ్కోలు సన్మాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

### వసతి గృహం పరిశీలన

**నకిరేకల్ :** సంక్షేమ హాస్టళ్లకు పక్కా భవనాలు నిర్మించాలని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు నాగార్జున కోరారు. నకిరేకల్‌లోని ఎస్సీ హాస్టల్‌లో మంగళవారం ఆయన విద్యార్థులతో మాట్లాడారు. ఈ సందర్భంగా విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు వంటెపాక కృష్ణ, చిలుముల రామస్వామి, అరవింద్, జమదగ్ని పాల్గొన్నారు.

### ప్రజా సమస్యలపై పోరాడేది కమ్యూనిస్టులే

**చండూరు :** ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడేది కమ్యూనిస్టులేనని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు బండ శ్రీశైలం అన్నారు. మంగళవారం చండూరులో నిర్వహించిన సీపీఎం మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. నీట్ అవకతవకలకు కేంద్ర ప్రభుత్వం పూర్తి బాధ్యత వహించాలన్నారు. రెండు లక్షల రుణమాఫీకి ఎలాంటి నిబంధనలు పెట్టకుండా రైతులందరికీ వర్తింపజేయాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి మొగుదాల వెంకటేశం, మండల సహాయ కార్యదర్శి జెర్రిపోతుల ధనంజయ గౌడ్, కొత్తపల్లి నరసింహ, గౌసియా బేగం, రవి, వెంకన్న, స్వామి తదితరులు పాల్గొన్నారు.

### రైతు భరోసాపై అభిప్రాయ సేకరణ



రైతులతో మాట్లాడుతున్న గోలి శ్రీనివాస్

**చండూరు :** రైతు భరోసా పథకంపై మంగళవారం చండూరు రైతు సేవా సహకార సంఘం కార్యాలయంలో అధికారులు రైతులతో సమావేశం నిర్వహించారు. రైతుల అభిప్రాయాలు, సూచనలు తీసుకున్నారు. సంఘం అధ్యక్షురాలు, డీసీసీబీ డైరెక్టర్ కోడి సుష్మ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జిల్లా సహకార ఆడిట్ అధికారి, డిప్యూటీ రిజిస్ట్రార్ గోలి శ్రీనివాస్, వంగూరి విజయ కృష్ణ, మండల వ్యవసాయ అధికారి రేవతి, పాలకవర్గ సభ్యులు, సంఘ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### కళ్లద్దాల పంపిణీ

**చిట్యాల:** మండలంలోని గుండ్రాంపల్లి గ్రామంలో ఏసిరెడ్డి శ్రీరామ్‌రెడ్డి, కృపాకర్‌రెడ్డి జ్ఞాపకార్థం ఇటీవల ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. వైద్యశిబిరంలో కళ్లద్దాలు అవసరమైన వృద్ధులకు మంగళవారం డీసీసీబీ వైస్ చైర్మన్ ఏసిరెడ్డి దయాకర్‌రెడ్డి ఉచితంగా అందజేశారు. మాజీ సర్పంచ్ ఏసిరెడ్డి బుచ్చిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు నమ్ముల విజయ్‌కుమార్‌గౌడ్, పీఏసీఎస్ డైరెక్టర్ దోర్నాల రామచంద్రం, దుబ్బ కుమార్, సత్తయ్యగౌడ్, నర్సింహాగౌడ్, బుస్సు శ్రీనివాస్, చంద్రారెడ్డి, వెంకటేష్‌గౌడ్ పాల్గొన్నారు.

### రాహుల్‌గాంధీపై ఫిర్యాదు

**నల్లగొండ టూటౌన్:** పార్లమెంట్‌లో హిందువులను కించపరిచేవిధంగా మాట్లాడిన కాంగ్రెస్ అగ్రనేత, ఎంపీ రాహుల్‌గాంధీపై చర్యలు తీసుకోవాలని కోరుతూ బీజేవైఎం నాయకులు మంగళవారం నల్లగొండ వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అనంతరం బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు వంగూరి రాఖీ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ విధానం మొదటి నుంచి హిందువులకు వ్యతిరేకమని, విభజన రాజకీయాలు చేస్తోందని మండిపడ్డారు. ఆయన వెంట పలువురు బీజేవైఎం నాయకులు ఉన్నారు.

# అసంపూర్తిగా డబుల్ బెడ్ రూం ఇళ్లు



చిట్యాలలో అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్ రూం ఇళ్లు



వట్టిమర్తిలో పిల్లర్ల దశలోనే నిలిచిపోయిన డబుల్ బెడ్ రూం ఇళ్లు

- గత ప్రభుత్వ హయాంలో పనులు ప్రారంభం
- నిధులు సరిపోవడం లేదని ఇళ్ల నిర్మాణాలు నిలిపివేసిన కాంట్రాక్టర్
- ఆశగా ఎదురుచూస్తున్న పేద ప్రజలు

**చిట్యాల:** సొంత ఇల్లు ప్రతిఒక్కరి కల. గత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన డబుల్ బెడ్ రూం ఇళ్ల పథకంలో ఇళ్ల నిర్మాణ పనులు అసంపూర్తిగా నిలిచిపోవడంతో పథకం లక్ష్యం నెరవేరలేదు. చిట్యాల మున్సిపాలిటీతోపాటు, మండలంలోని గుండ్రాంపల్లి గ్రామంలో డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణాలు తొంభై శాతానికిపైగా పూర్తవగా, వట్టిమర్తి గ్రామంలో వంద డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణ పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. కాగా ప్రస్తుతం రాష్ట్రంలో ఏర్పాటైన నూతన ప్రభుత్వం అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణాలను పూర్తిచేసి తమకు కేటాయిస్తుందని పేదలు ఆశగా ఎదురుచూస్తున్నారు.

**రూ.12.09 కోట్ల అంచనా వ్యయం**

ఇరవై రెండేళ్ల క్రితం చిట్యాల పట్టణ శివారులోని 168 సర్వే నంబర్‌లో 14 ఎకరాల భూమిని ప్రభుత్వం కొనుగోలు చేసి ఇళ్లు లేని పేదలకు పట్టాలు అందజేసింది. కానీ ఆ స్థలంలో తగిన మౌలిక వసతులు లేకపోవడంతో లబ్ధిదారులు ఎవరూ ఇళ్లను నిర్మించుకోలేదు. దీంతో ఆ ప్లాట్లను రెవెన్యూ అధికారులు రద్దు చేశారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వం 2017లో ఆ స్థలంలో అర్హులైన పేదలకు ఇచ్చేందుకు డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణాలను చేపట్టింది. ఈ స్థలంలో రూ.12.09 కోట్ల అంచనా వ్యయంతో 240 పైగా డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణాలను చేపట్టారు. స్లాబు, మధ్యలోని గోడల నిర్మాణాలు పూర్తయ్యాయి. ఇళ్లకు తెల్లటి రంగు సైతం వేశారు. ఇక ఇళ్లకు తలుపులు, కిటికీ తలుపులు ఏర్పాటు చేసి, మంచినీటి సౌకర్యం కల్పించి, ఎలక్ట్రికల్, ప్లంబింగ్ పనులు చేసినట్లయితే ఇళ్ల నిర్మాణాలు పూర్తవుతాయి.

**గుండ్రాంపల్లిలో..**

చిట్యాల మండలంలోని గుండ్రాంపల్లిలో రూ.2.82 కోట్ల అంచనా వ్యయంతో ప్రభుత్వం యాభై ఆరు డబుల్ బెడ్ రూం ఇళ్లు మంజూరు చేసింది. దీంతో చిట్యాల పట్టణ శివారులో జాతీయ రహదారి పక్కన డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణాలకు అధికారులు స్థలాన్ని సేకరించారు. ఆ ప్రాంతంలో డబుల్ బెడ్‌రూం ఇళ్లను నిర్మించేందుకు 2017వ సంవత్సరంలో పనులను ప్రారంభించారు. ప్రస్తుతం యాభై ఆరు డబుల్ బెడ్ రూం ఇళ్లకు స్లాబు వేయడం పూర్తవగా, ఇళ్లకు తలుపులు, కిటికీలు, ప్లంబింగ్, ఎలక్ట్రికల్, మంచినీటి వసతి కల్పిస్తే ఇళ్ల నిర్మాణం పూర్తవుతుంది.

**వట్టిమర్తిలో మందకొడిగా..**

వట్టిమర్తి గ్రామంలో రూ.3.02 కోట్ల అంచనా వ్యయంతో వంద డబుల్‌బెడ్ రూం ఇళ్లను ప్రభుత్వం మంజూరు చేసింది. 2017లో అరవై ఇళ్ల నిర్మాణ పనులు మొదలుపెట్టారు. వీటిలో నలభై ఇళ్లకు మాత్రమే స్లాబ్ లెవల్ వరకు పనులు జరిగాయి. కాగా కొన్ని ఇళ్ల నిర్మాణ పనులు పిల్లర్స్ దశలోనే నిలిచిపోయాయి. అయితే నిధులు సరిపోవడం లేదని ఆయా గ్రామాల్లో డబుల్ బెడ్‌రూం ఇళ్లను సంబంధిత కాంట్రాక్టర్ పూర్తి చేయలేదని తెలుస్తోంది. ఈ విషయమై ఇప్పటికే కాంట్రాక్టర్‌కు అధికారులు నోటీసులు కూడా ఇచ్చినట్లు సమాచారం.

**ఎన్నికలకు ముందు దరఖాస్తుల స్వీకరణ**

సొంత ఇల్లు లేని పేదలు డబుల్ బెడ్ రూం ఇళ్ల కోసం ఆశగా ఎదురుచూస్తున్నారు. గత ఏడాది జరిగిన ఎన్నికల ముందు డబుల్ బెడ్ రూం ఇళ్ల లబ్ధిదారుల ఎంపికకుగాను రెవెన్యూ అధికారులు దరఖాస్తులు స్వీకరించారు కానీ లబ్ధిదారుల ఎంపిక చేపట్టలేదు. చిట్యాల పట్టణంతోపాటు పలు గ్రామాల్లో సొంత ఇళ్లు లేని వారు అద్దె చెల్లించలేక ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణ పనులను పూర్తిచేసి లబ్ధిదారుల ఎంపిక చేపట్టాలని ఇళ్లు లేని నిరుపేదలు కోరుతున్నారు.

**లబ్ధిదారులను ఎంపిక చేయాలి**



మాకు సొంత ఇల్లు లేక ఇబ్బందులు పడుతున్నాం. ఎన్నో ఏళ్లుగా వేలాది రూపాయలు చెల్లిస్తూ కిరాయి ఇంటిలో ఉంటున్నాం. డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణాలను పూర్తిచేసి లబ్ధిదారులను ఎంపిక చేయాలి. అర్హులైన ఇళ్లు లేని పేదలను లబ్ధిదారులుగా గుర్తించాలి.

–నాగిళ్ల లక్ష్మణ్‌రావు, చిట్యాల

**తొంభై శాతం పనులు పూర్తయ్యాయి**

చిట్యాల, గుండ్రాంపల్లి గ్రామాల్లో చేపట్టిన డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణ పనులు తొంభై శాతం పూర్తయ్యాయి. వట్టిమర్తిలో కొంత మేరకు నిర్మాణ పనులు అసంపూర్తిగా ఉన్నాయి. ఇళ్ల నిర్మాణాలు పూర్తయిన అనంతరం కలెక్టర్ ఆదేశాల మేరకు అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేస్తాం.

–మల్లికార్జున్, పంచాయతీరాజ్ ఏఈ

# ప్రజా సమస్యలను పరిష్కరించండి

- డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి

**మునుగోడు:** గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను సత్వరం పరిష్కరించాలని డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి అధికారులకు సూచించారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన మండల సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రతి అధికారి ప్రజాప్రతినిధులతో కలిసి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంతోపాటు గ్రామాల్లో అభివృద్ధి పనులను వేగవంతం చేయాలన్నారు. స్థానిక ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి సహకారంతో మునుగోడు మండలంలో అభివృద్ధి పనులు వేగవంతం చేసేందుకు తన శాయశక్తులా కృషి చేస్తానన్నారు. అందుకు మండలంలోని ప్రజాప్రతినిధులు, అధికారులు సహకరించాలని కోరారు. అంతకుముందు అధికారులు తమ శాఖలకు సంబంధించిన నివేదికలను చదివి వినిపించారు. వివిధ గ్రామాల ఎంపీటీసీలు పలు సమస్యలపై అధికారులను ప్రశ్నించారు. ఎంపీపీ కర్నాటి స్వామి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జెడ్పీటీసీ నారబోయిన స్వరూపరాణి రవి, ఎంపీడీఓ పూజ, వైఎస్ ఎంపీపీ అనంత వీణలింగస్వామి తదితరులు పాల్గొన్నారు.

**డీసీసీబీ చైర్మన్‌కు ఘన సన్మానం**

డీసీసీబీ చైర్మన్‌గా ఎన్నికై మొదటిసారి మునుగోడుకు వచ్చిన కుంభం శ్రీనివాస్‌రెడ్డిని మునుగోడు మండలానికి చెందిన వివిధ శాఖల అధికారులు, పలువురు కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు మంగళవారం ఘనంగా సన్మానించారు. ఎంపీడీఓ కార్యాలయంతోపాటు పీఏసీఎస్ కార్యాలయంలో ఆయనను ప్రత్యేకంగా కలిసి పూలమాలలు, శాలువాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ కర్నాటి స్వామి, జెడ్పీటీసీ నారబోయిన స్వరూపరాణిరవి, వైఎస్ ఎంపీపీ అనంత వీణలింగస్వామి, ఎంపీడీఓ పూజ, ఏడీఏ ఎల్లయ్య, ఎస్ఐ వెంకటేశ్వర్లు, ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు, మాజీ సర్పంచ్‌లు తదితరులు ఉన్నారు.

# పార్టీలకు అతీతంగా అభివృద్ధి చేద్దాం



ప్రజాప్రతినిధులను సన్మానిస్తున్న ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది

**కనగల్ :** పార్టీలకు అతీతంగా పనిచేసి గ్రామాలను అభివృద్ధి చేసుకుందామని ఎంపీపీ కరీంపాష అన్నారు. మంగళవారం మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన చివరి మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ప్రజలు మనకు ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటేనే భవిష్యత్ ఉంటుందన్నారు. అధికారులకు పదవీ విరమణ కాలం ఉన్నప్పటికీ, రాజకీయ నాయకులకు అలాంటిది ఉండదన్నారు. ప్రజల మన్ననలు పొందితేనే మళ్లీ వారికి సేవ చేసే అవకాశం వస్తుందని భావోద్వేగంతో అన్నారు. ఐదేళ్లపాటు తనకు సహకరించిన మండల ప్రజాప్రతినిధులకు, ఆయా శాఖల అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

**ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీలకు సన్మానం**

ఈ నెల 4న ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యుల పదవీ కాలం ముగియనుండడంతో ఎంపీపీ కరీంపాష, ఎంపీటీసీ సభ్యులను అధికారులు సన్మానించారు. ప్రజాప్రతినిధులకు ఎంపీడీఓ జయరాం, ఎంపీఓ, ఉపాధిహామీ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, కార్యాలయ సిబ్బంది మెమొంటోలు అందజేసి శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ దోటి శ్రీనివాస్, తహసీల్దార్ పద్మ ఆయా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# నిరుద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



చండూరు : వినతి పత్రం అందిస్తున్న నాయకులు



చిట్యాల: వినతి పత్రం అందజేస్తున్న బీజేవైఎం నాయకులు

**చిట్యాల:** నిరుద్యోగుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ చిట్యాలలో తహసీల్దార్ కృష్ణకు చిట్యాల మండల బీజేవైఎం నాయకులు మంగళవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నకిరేకల్ నియోజకవర్గ బీజేవైఎం కన్వీనర్ గరిషే నరేష్ మాట్లాడుతూ ప్రభుత్వం ఉద్యోగ నోటిఫికేషన్లను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి పున్న విష్ణు, మండల అధ్యక్షుడు చెన్నోజు సాయికిరణ్‌చారి, ఉదయ్, మల్లేష్, ధనుంజయ్, రవివర్మ, చందు, నరేష్ పాల్గొన్నారు.

**చండూరు :** నిరుద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ భారతీయ జనతా యువమోర్చా నాయకులు మంగళవారం చండూర్ తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. యువమోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు సోమ శంకర్ , బూతరాజు శ్రీహరి, పేర్ల గణేశ్, బూతరాజు వేణు, సంగెపు సాయి, మల్లేశం, రాజు, శివ తదితరులు పాల్గొన్నారు.

**ఉద్యోగాల నోటిఫికేషన్ ఇవ్వాలని వినతి**

**కేతేపల్లి:** ప్రభుత్వ ఉద్యోగాల నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బీజేవైఎం నాయకులు మంగళవారం కేతేపల్లి తహసీల్దారు కార్యాలయంలో ఆర్ఐ భవానికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీజేవైఎం మండల అధ్యక్షుడు జటంగి సైదులు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడు నెలలు గడిచినా జాబ్ క్యాలెండర్ విడుదల చేయకుండా నిరుద్యోగులను మోసం చేసిందన్నారు. బీజేపీ జిల్లా మాజీ ఉపాధ్యక్షురాలు ఎ.అనిత, చినేని జాను, పిట్టల వెంకట్, చెరుకు రోషయ్య, విజయలక్ష్మి, రాచకొండ శ్రీనివాస్, శేఖర్, మహేష్ పాల్గొన్నారు.

### డబుల్ బెడ్ రూం ఇళ్లను పంపిణీ చేయాలి

**నార్కట్‌పల్లి :** మండలంలోని ఔరవాణి, బి వెల్లంల గ్రామాల్లో నిర్మించిన డబుల్ బెడ్ రూం ఇళ్లను అర్హులైన వారికి పంపిణీ చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు ఎస్ఆర్ వెంకటేశ్వర్లు, మండల కార్యదర్శి చెరుకు పెద్దులు ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం మండల కేంద్రంలో నిర్వహించిన పార్టీ సమావేశంలో వారు మాట్లాడారు. వైస్ ఎంపీపీ కల్లూరి యాదగిరి, బయన్న, దండు రవి, అర్థం శ్రీను, నరసింహ, నాగరాజు, యాదగిరిరెడ్డి ఉన్నారు.

### ప్రచార పోస్టర్ విడుదల

**చిట్యాల:** హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో ఈ నెల7వ తేదీన నిర్వహించనున్న దండోర రజతోత్సవాన్ని విజయవంతం చేయాలని నకిరేకల్ నియోజకవర్గ ఎమ్మార్పీఎస్–టీఎస్ ఇన్‌చార్జ్ పోలెపల్లి సత్యనారాయణ కోరారు. చిట్యాలలో మంగళవారం దండోర రజతోత్సవ ప్రచార పోస్టర్‌లను ఆయన విడుదల చేసి మాట్లాడారు. పిల్లి నగేష్, బరలా వెంకన్న, జిట్ట స్వామి, సైదులు పాల్గొన్నారు.

### ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు



మాట్లాడుతున్న ఎస్ఐ రామకృష్ణ

**కనగల్ :** ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ రామకృష్ణ, తహసీల్దార్ పద్మ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో శాండ్ టాక్సీపై ఇసుక ట్రాక్టర్ల ఓనర్లు, డ్రైవర్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శాండ్ టాక్సీ విధానంపై ఇసుక ట్రాక్టర్ల ఓనర్లు, డ్రైవర్లు అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎంపీఓ సుమలత, ఆర్ఐ యాదగిరి ఎస్ఆర్‌ఓలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

### పత్తి చేల పరిశీలన



రైతులకు సూచనలు ఇస్తున్న ఏఓ పురుషోత్తం

**కేతేపల్లి:** పత్తి పంటలో రైతులు సకాలంలో సరైన సస్యరక్షణ చర్యలు చేపట్టి తెగుళ్ల బారిన పడకుండా కాపాడుకోవాలని కేతేపల్లి ఏఓ బి.పురుషోత్తం సూచించారు. మండలంలోని బండపాలెం గ్రామంలో రైతులు సాగు చేసిన పత్తి పంటను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ పత్తిలో గడ్డి, వెడల్పాటి ఆకులు గల కలుపును గుర్తించినట్లయితే నివారణకు ఎకరాకు 400 మి.లీ క్విజలోఫోస్ ఇ ఇథైల్, మందును 200 లీటర్ల నీటికి కలిపి పిచికారీ చేయాలని సూచించారు. సిఫారసు చేసిన మేరకే నత్రజని, పొటాష్ ఎరువులను నాలుగు సమ భాగాలుగా చేసి విత్తిన 20,40, 60, 80 రోజులకు వేయాలని సూచించారు. కార్యక్రమంలో రైతులు లింగయ్య, రూబెన్, సైదిరెడ్డి, శివ పాల్గొన్నారు.

### పీహెచ్‌సీలలో సర్వే

**కట్టంగూర్ :** ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఖాళీగా ఉన్న పోస్టులను ప్రభుత్వం వెంటనే భర్తీ చేయాలని ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు ప్రభావతి డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో ఐద్వా ఆధ్వర్యంలో సర్వే నిర్వహించి రోగులకు అందుతున్న సేవలను వైద్యాధికారి శ్వేతను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఐద్వా రాష్ట్ర కమిటీ సభ్యులు జిట్ట సరోజ, జాలె యాదమ్మ, సుకన్య, రుక్కమ్మ పాల్గొన్నారు.

**నార్కట్‌పల్లిలో..**

**నార్కట్‌పల్లి :** పీహెచ్‌సీల్లో సిబ్బంది కొరత తీవ్రంగా ఉందని ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు ప్రభావతి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో ఐద్వా ఆధ్వర్యంలో సర్వే నిర్వహించిన అనంతరం ఆమె మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిట్ట సరోజ, జాల యాదమ్మ, సుకన్య, రుక్కమ్మ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సేవ చేయడం అదృష్టంగా భావించాలి

- నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం



నకిరేకల్ : ఎంపీపీ శ్రీదేవి-గంగాధర్‌రావు దంపతులను సత్కరిస్తున్న ఎమ్మెల్యే వీరేశం

**నకిరేకల్ :** ప్రజల సేవ చేసేందుకు అవకాశం రావడం అదృష్టంగా భావించాలని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. నకిరేకల్ మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం జరిగిన ఎంపీపీ, ఎంపీటీసీల వీడ్కోలు సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఎంపీపీ బచ్చుపల్లి శ్రీదేవిగంగాధర్‌రావు తన పదవీ కాలంలో ప్రజాసేవ చేస్తూ ముందుకు సాగారని అన్నారు. ఎంపీపీగా బాధ్యతలు నిర్వహిస్తూనే బీజీఆర్ ఫౌండేషన్ పేరుతో ఎంతోమంది పేదలకు ఆర్థిక సహాయం, నిరుపేద విద్యార్థులకు బాసటగా నిలిచారని కొనియాడారు. అనంతరం ఎంపీపీతో పాటు ఎంపీటీసీలను ఘనంగా సన్మానించారు. ఎంపీపీ బచ్చుపల్లి శ్రీదేవి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఎంపీడీఓ చంద్రశేఖర్, పూజర్ల శంభయ్య, మాజీ ఎంపీపీ చామల శ్రీనివాస్, పీఏసీఎస్ చైర్మన్ నాగులంచ వెంకటేశ్వరరావు, ఎంపీటీసీలు గాదగోని శ్రీలత కొండయ్య, దాసరి వీరార్జున్‌రెడ్డి, ఇమడపాక లక్ష్మీవెంకన్న, బోయిళ్ల కిశోర్, లోడే సాగర్, ఖాసీంఖాన్, సామ మల్లమ్మ పాల్గొన్నారు.

**పథకాలను సమర్థంగా అమలు చేయాలి..**

ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సమర్థంగా అమలు చేయాలని ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. నకిరేకల్‌లో మంగళవారం జరిగిన చివరి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ బచ్చుపల్లి శ్రీదేవి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ఆయన పాల్గొని వివిధ శాఖల సమీక్ష చేశారు. మండల పరిషత్ పాలక వర్గం గడువు ముగిసినందున వచ్చే పాలక వర్గం ఎన్నిక వరకు క్షేత్ర స్థాయిలో ఎలాంటి సమస్యలు తలెత్తినా వెంటనే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ముందుగా మండల పరిషత్ జనరల్ ఫండ్ కింద నిర్మించిన కార్యాలయం అదనపు గదులు, షెడ్డును ఎమ్మెల్యే ప్రారంభించారు.

**ఆదర్శ రైతు వ్యవస్థను పునరుద్ధరించాలని..**

కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టో మేరకు ఆదర్శ రైతుల వ్యవస్థను పునరుద్ధరించాలని కోరుతూ ఆదర్శ రైతుల సంఘం నాయకులు మంగళవారం నకిరేకల్‌లో ఎమ్మెల్యే వేముల వీరేశంకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు వంటిపాక భీమయ్య, మహిందర్‌రెడ్డి, పందిరి సుధాకర్, పాలడగు ఎల్లయ్య, అబ్బగోని శ్రీను తదితరులు ఉన్నారు.

**నిధులు మంజూరు చేయాలని వినతి**

**కట్టంగూర్ :** మండలంలోని అయిటిపాముల గ్రామంలో గల కబరస్తాన్ ప్రహరీ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరుతూ ఆగ్రామ ముస్లింలు మంగళవారం నకిరేకల్‌లో ఎమ్మెల్యే వేముల వీరేశంకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మసీదు కమిటీ అధ్యక్షుడు సయ్యద్ దస్తగిరి మాట్లాడుతూ జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా కబరస్తాన్ ప్రహరీ కూల్చివేసి డ్రెయినేజీ నిర్మించకపోవడంతో మురుగు, వర్షపు నీరు చేరి దహన సంస్కారాలకు ఇబ్బంది కలుగుతోందన్నారు. ప్రహరీ లేకపోవడంతో వ్యాపారులు చెత్తచెదారం వేయడం వల్ల దుర్వాసన వస్తోందన్నారు. ప్రహరీ, డ్రెయినేజీ ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో ముబిన్, షకీల్, సయ్యద్ ఉస్మాన్, రహీం, రష్మిత్, అఫ్జల్, యాసిన్ పాల్గొన్నారు.

**సమస్యల పరిష్కారానికి కృషి చేయండి**

**చిట్యాల:** గ్రామీణ ప్రాంతాల్లో పాడి రైతుల, పాల ఉత్పత్తిదారుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం సూచించారు. మండలంలోని తాళ్లవెల్లెంల గ్రామ పాల ఉత్పత్తిదారుల పరస్పర సంఘం చైర్మన్‌గా ఎన్నికైన బత్తుల వెంకటేశం, చిన్నకాపర్తి గ్రామ పాల ఉత్పత్తిదారుల సంఘం చైర్మన్‌గా ఎన్నికైన దాసరి సైదులుతోపాటు ఆయా సంఘాల పాలకవర్గ సభ్యులు నకిరేకల్‌లో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఎమ్మెల్యే వేముల వీరేశాన్ని కలిశారు. నూతన పాలకవర్గ సభ్యులను ఎమ్మెల్యే అభినందించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో తాళ్లవెల్లెంల మాజీ సర్పంచ్ జనగాం రవీందర్‌గౌడ్, బుచ్చిరాములు, లక్ష్మయ్య, బైరు వెంకన్న, లింగస్వామి, చిన్నకాపర్తి గ్రామ నాయకులు సుందర్‌యాదవ్, వెంకటేశం, సోమయ్య, సత్యనారాయణ, నాగశంకర్, నర్సింహ, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

**ఎల్‌ఓసీ పత్రాలు అందజేత**

చిట్యాల మండలంలోని చిన్నకాపర్తి గ్రామానికి చెందిన వరికుప్పల ఎల్లయ్య కుమారుడు కుమార్ ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. అతడి వైద్య చికిత్స ఖర్చులకుగాను రెండు లక్షల రూపాయల సీఎంఆర్ఎఫ్ ఎల్‌ఓసీ పత్రాలను మంగళవారం నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం బాధిత కుటుంబసభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో ఆ గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బోయపల్లి వెంకన్నగౌడ్, మాజీ ఉప సర్పంచ్ ఆవుల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

**అలరించిన నృత్య ప్రదర్శన**



జాతీయ డాక్టర్స్ డే వేడుకలను నీలగిరి ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా డాక్టర్లు ప్రదర్శించిన సంప్రదాయ నృత్యం సభికులను ఆకట్టుకుంది. అనంతరం డాక్టర్లను సన్మానించారు. కార్యక్రమంలో ఐఎంఏ అధ్యక్షురాలు డాక్టర్ అనితారాణి, కార్యదర్శి డాక్టర్ రమేష్, డాక్టర్లు పుల్లారావు, లీలావతి, వసంతకుమారి, గౌరీశ్రీ, అరుంధతి, హేమలత, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు. – నల్లగొండ టౌన్

### ఏకాదశి మహా యజ్ఞం

**కట్టంగూర్ :** ఏకాదశి పర్వదినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలోని శ్రీలక్ష్మీనారాయణ స్వామి దేవస్థానంలో మంగళవారం స్వామివారి ఏకాదశి మహాయజ్ఞ కార్యక్రమాన్ని ఆలయ పూజారి శ్రీరామడుగు శ్రీనివాసశర్మ ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారికి పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు.రుద్రాబట్ల జితేందర్, రెడ్డిపల్లి సైదులు, బండారు గుప్తా, ఇల్లెందుల సంధ్య, నాగమ్మ పాల్గొన్నారు.



యజ్ఞంలో పాల్గొన్న భక్తులు

### ఉద్యోగ ఖాళీలను భర్తీ చేయాలి

**చిట్యాల:** రాష్ట్రంలో ఉన్న ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయాలని డీవైఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లం మహేష్ డిమాండ్ చేశారు. చిట్యాలలో మంగళవారం జరిగిన డీవైఎఫ్ఐ సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు రెండు లక్షల ఉద్యోగాలను భర్తీ చేయాలన్నారు. జిట్ట రమేష్, మహేష్, కిరణ్, సురేష్, దినేష్ పాల్గొన్నారు.

### నేడు వీడ్కోలు సమావేశం

**కేతేపల్లి:** ఎంపీటీసీల పదవీ కాలం ముగియనుండడంతో బుధవారం కేతేపల్లిలోని ఎంపీడీఓ కార్యాలయంలో మండలంలోని ఎంపీటీసీలకు వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేసినట్లు ఎంపీడీఓ బి.శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈసమావేశానికి స్థానిక ఎమ్మెల్యే వేముల వీరేశం ముఖ్య అతిథిగా హాజరవుతున్నారని అన్నారు.

### పర్యావరణంపై అవగాహన

**నార్కట్‌పల్లి :** మండల కేంద్రంలోని హైస్కూల్‌లో చదువుతున్న 50 మంది విద్యార్థులు స్వాన్ సంస్థ ఆధ్వర్యంలో రంగారెడ్డి జిల్లా కత్తాల్ మండలం, అన్మాష్‌పల్లి గ్రామంలో ఉన్న ఎర్త్ సెంటర్‌ని సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా గ్రీన్ రెవల్యూషన్ సంస్థ ఫౌండర్ అధ్యక్షుడు లీలా లక్ష్మిరెడ్డి విద్యార్థులకు పర్యావరణంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు రాములు, స్వాన్ (స్టూడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆఫ్ నార్కట్‌పల్లి) సంస్థ అధ్యక్షుడు సత్తిరెడ్డి, స్వాన్ కో ఆర్డినేటర్ దామెర ఉదయ్‌కుమార్ సభ్యులు శ్రవణ్, నవీన్, నరసింహ, అంజిరెడ్డి తదితరులు ఉన్నారు.

### ఫీజుల దోపిడీ అరికట్టాలని వినతి

**నల్లగొండ టౌన్ :** ప్రైవేటు పాఠశాలల ఫీజుల దోపిడీని అరికట్టాలని కోరుతూ మంగళవారం స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పూర్ణచంద్రకు ధర్మసమాజ్ పార్టీ నాయకులు వినతి పత్రం అందజేశారు. ప్రైవేటు పాఠశాలల్లో 25 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని విన్నవించారు. కార్యక్రమంలో వెంకన్న, శంకర్, జగన్, ఎల్లయ్య, మహేశ్వరచారి, రవి, సతీష్ పాల్గొన్నారు.



అదనపు కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న ధర్మసమాజ్ పార్టీ నాయకులు